క్లుప్తంగా

ప్రయాణాల్లో హెల్మెట్ ధారణ తప్పనిసరి

ఎస్పీ వకుల్‌జిందాల్



బాపట్లటౌన్: ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వ్యక్తులు హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వలనే ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అధికంగా మృతి చెందడం జరిగిందని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో శనివారం 'నో యాక్సిడెంట్ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో అధికంగా మృతి చెందడానికి ప్రధాన కారణం ద్విచక్రవాహనంపై ప్రయాణించే వ్యక్తులు హెల్మెట్ ధరించకపోవడమేనని అన్నారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని సూచించారు.

ఇరువురి మధ్య ఘర్షణలో వ్యక్తి మృతి

కర్లపాలెం: ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలై మృతి చెందిన సంఘటన బాపట్ల జిల్లా కర్లపాలెం పంచాయతీ ఎంవీ రాజుపాలెంలో చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్‌ఐ పి.జనార్దన్ తెలిపిన వివరాల మేరకు కర్లపాలెం మండలం ఎంవీరాజుపాలెం గ్రామానికి చెందిన చల్లా పిచ్చయ్య(48), కర్లపాలెం పంచాయతీ పాత ఇస్లాంపేటకు చెందిన పఠాన్ కరిముల్లా ఇరువురు పాత సామాన్లు, ప్లాస్టిక్ సీసాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. పాత సామాన్లు విక్రయించే విషయంలో ఇరువురి మధ్య గత నెల 29న వాగ్వాదం పెరిగి ఘర్షణకు దారి తీసింది. పఠాన్ కరిము ల్లా కర్రతో పిచ్చయ్య తలపై కొట్టటంతో తలకు తీవ్ర గాయమైంది. శనివారం తెల్లవారు జా మున పిచ్చయ్య మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ జనార్దన్ తెలిపారు.

7న వెల్లటూరులో ఆలయ వార్షికోత్సవం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం వెల్లటూరు లాక్ సెంటర్‌లో కొలువైన శ్రీ కనకదుర్గా మహంకాళీ, నాగేంద్రస్వామి ఆలయ 16వ వార్షికోత్సవాన్ని ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జొన్నా సుబ్బారావు భవాని శనివారం తెలిపారు. ఆ రోజు ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు, సత్యన్నారాయణ స్వామి వ్రతం, కుంకుమ పూజలు జరుగుతాయని పేర్కొన్నారు. అన్న ప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు.

4న బాలకోటేశ్వరుని ఆలయంలో సమావేశం

అమృతలూరు(భట్టిప్రోలు): అమృతలూరు మండలం గోవాడలో కొలువైన బాలకోటేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 4న మధ్యాహ్నం 3 గంటలకు వివిధ శాఖల అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం జరుగుతుందని కార్యనిర్వాహణాధికారి ఈమని అశోక్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ సమావేశానికి రేపల్లె ఆర్డీవో హేలాషారోన్, బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

6న గూడవల్లిలో జాబ్‌మేళా

చెరుకుపల్లి: మండలంలోని గూడవల్లిలోని త్రిపురనేని రామస్వామి చౌదరి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 6న ఉదయం 9 నుంచి జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్యాంప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్, ఎస్ఎస్ఎల్ టెక్స్‌టైల్స్, ఫస్ట్ టెక్ సొల్యూషన్స్, హెట్రో డగ్స్, ఆదిత్య బిర్లా కాపిటల్స్ వంటి పలు సంస్థలలో ఉద్యోగాల భర్తీకై ఇంటర్వ్యూలు నిర్వహించబడతాయని చెప్పారు. ఇంటర్, ఐటిఐ, డిప్లొమా, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ విద్యార్హత గల అభ్యర్థులు ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. పూర్తి వివరాలకై కళాశాలలో సంప్రదించాలన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

పొన్నూరు: విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరారు. పట్టణంలోని పాత పొన్నూరు సోషల్ వెల్ఫేర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు నజీర్ అహ్మద్ అదే పాఠశాలలోని చిన్నారులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విషయాన్ని విద్యార్థులు తల్లిదండ్రులు చెప్పడంతో పాఠశాలకు చేరుకొని ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న ఎంఈఓ రుద్రపాటి శోభాచంద్ పాఠశాలకు చేరుకొని విచారించారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేసి ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం తల్లిదండ్రులు ఉపాధ్యాయుడిపై అర్బన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ పి. భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జై భారత్ పార్టీ ఇన్‌చార్జిగా భాగ్యరాజు

వేమూరు: జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు వేమూరు నియోజకవర్గం సమన్వయకర్తగా బి భాగ్యరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా రవి కిరణ్‌ను ప్రకటించడం జరిగిందని ఆ పార్టీ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపట్ల జిల్లా లోని వేమూరు నియోజకవర్గం పార్టీ సమన్వయకర్తగా తనను నియమించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జేడీ లక్ష్మీనారాయణకు భాగ్యరాజు కృతజ్ఞతలు తెలిపారు. నియోజక వర్గంలోని ప్రతి ఇంటికి వెళ్లి జేడీ లక్ష్మీనారాయణ పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

రైతు బాంధవుడు సీఎం జగన్

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి
- మార్కెట్ యార్డులో నూతన భవన నిర్మాణానికి డాక్టర్ ఈవూరితో కలిసి శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి, డాక్టర్ ఈవూరి గణేష్

రేపల్లెరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులను ప్రోత్సహిస్తూ పలు పథకాలను విజయవంతంగా అమలు చేయటంతో రైతు పక్షపాతిగా మారిపోయారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. పట్టణంలోని మార్కెట్‌యార్డులో రూ.కోటి నిధులతో నిర్మించనున్న పాలకవర్గ పరిపాలన నూతన భవనానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్‌తో కలిసి శంఖుస్థాపన చేసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసిన ఘనుడు చంద్రబాబు అయితే వ్యవసాయాన్ని పండుగ చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రతి ఏటా ఖరీఫ్‌కు ముందుగానే పెట్టుబడి సాయాన్ని అందజేస్తూ రైతులపై భారం లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా పంటలకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు సరఫరా చేయటంతో పాటు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా చర్యలు చేపట్టారన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ రైతు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్న సిద్ధాంతాన్ని నమ్మిన జగనన్న రైతులకు అన్నివేళలా అండగా ఉంటున్నారన్నారు. రైతుల సంక్షేమం కోసం పాటుపడుతున్న జగనన్నకు రైతులు పూర్తిగా మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మార్కెట్‌యార్డు చైర్మన్ దేవగిరి సాంబశివరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, మార్కెట్ యార్డు కార్యదర్శి వేణు గోపాల్‌కృష్ణ, మార్కెట్‌యార్డు పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే కోన రఘుపతి

పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే రఘుపతి

కర్లపాలెం: కర్లపాలెం మండలం ఏట్రవారిపాలెంకు చెందిన 40 మంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు శనివారం రాత్రి ఎమ్మెల్యే కోన రఘుపతి సమక్షంలో ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే రఘుపతి వీరందరికీ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మంచి చేసే ప్రభుత్వాలకు ప్రజల మద్దతు ఉంటుందని చెప్పారు. పార్టీలో చేరిన టీడీపీ నాయకుడు పిట్టు వెంకన్న రెడ్డితో పాటు అతని అనుచరులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో తామందరికీ సంక్షేమ పథకాలు అందాయని అన్నారు.తామంతా స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, పార్టీ నాయకులు మందపాటి పరమానందకుమార్, ఆట్ల నాగేశ్వరరెడ్డి, ఆట్ల పెదశ్రీనివాసరెడ్డి, పేరాల వెంకట సురేష్, అమీర్‌బేగ్ తదితరులు ఉన్నారు.

వైద్యశాలలో వృద్ధురాలికి పింఛన్ అందజేత



వృద్ధురాలికి పింఛను అందిస్తున్న వలంటీర్ బాజీబాబా



గుంటూరు వైద్యశాలలో రోగికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అంజలి

రేపల్లె రూరల్: పట్టణంలోని 26వ వార్డుకు చెందిన మోపిదేవి వెంకట సుబ్బమ్మ అనారోగ్యంతో తెనాలిలోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. దీంతో వార్డు వలంటీరు షేక్ బాజీబాబా వెంకట సుబ్బమ్మకు చెందిన వృద్ధాప్య పింఛన్ రూ.3 వేలను తెనాలి వైద్యశాలకు వెళ్లి శనివారం అందజేశారు. కుటుంబ సభ్యులు వలంటీరుకు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వేమూరు: వేమూరు గ్రామంలోని కొండముది బాబూరావు అనారోగ్యంతో గుంటూరు ప్రభుత్వం వైద్య శాలలో చికిత్స పొందుతున్నాడు.దీంతో వలంటీర్ వేమూరి అంజలి శనివారం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి రోగికి పింఛను అందజేసింది. దీంతో రోగి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లతో పేదలకు న్యాయం



సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు

కొల్లూరు : జగనన్న కాలనీలలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతో పాటు, వారికి పూర్తి హక్కులు కల్పిస్తూ ఉచితంగా రిజిస్ట్రేషన్‌లు చేసి హక్కు పత్రాలు అందజేయడం లబ్ధిదారులకు ఎనలేని మేలు చేకూరనుందని కొల్లూరు జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు అన్నారు. శనివారం మండలంలోని సచివాలయాలలో గృహ నిర్మాణ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ కార్యక్రమం ర్వహించారు. కొల్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నివేశన స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేయించి ఉచితంగా పట్టాలు అందజేయడం ద్వారా వారికి ఆయా స్థలాలపై పూర్తి హక్కులు ఏర్పడతాయని అన్నారు. తద్వారా వారు పట్టాలను ఉపయోగించి బ్యాంక్ రుణాలు పొంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. మండలంలోని చినపులివర్రులో లబ్ధిదారులు తమ నివేశనా స్థలాలకు రిజిస్ట్రేషన్ పట్టాలు అందజేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ అయిల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు కమ్మెల సాంబయ్య, ఉప్పు శ్రీనివాసరావు, కొల్లూరు శ్రీనివాసరావు, గరిక రమేష్, కనపర్తి మోహన్‌రావు, మాతంగి రత్నకుమార్, దున్న వెంకయ్య, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో పాటు వినోదం అవసరం

- 'పలాస' సినిమా ఫేమ్ హీరో రక్షిత్
- మలినేనిలో ముగిసిన సంస్కృతి–2024 ఉత్సవాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న హీరో రక్షిత్, కళాశాల చైర్మన్ పెరుమాళ్లు

ప్రత్తిపాడు: విద్యార్థులకు విద్యతో పాటు వినోదమూ అవసరమేనని 'పలాస' సినిమా ఫేమ్ హీరో రక్షిత్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న సంస్కృతి- 2024 ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా పలాస ఫేమ్, సినిమా హీరో రక్షిత్ హాజరయ్యారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథులు రక్షిత్, భ్రమర టౌన్ షిప్ మేనేజింగ్ డైరెక్టర్ గల్లా రామచంద్రరావు చేతుల మీదుగా రూ. 5 లక్షల బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో హీరో రక్షిత్ మాట్లాడుతూ విద్యార్థుల మానసిక ఉల్లాసం కోసం సంస్కృతి వంటి వినోదాత్మక కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. అనంతరం మూడో సంవత్సరం ఈసీఈ విద్యార్థులు రైతుల కోసం తయారు చేసిన సీడ్ మిత్ర స్టార్టప్‌ను కళాశాల చైర్మన్ మలినేని పెరుమాళ్లు ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల్ని అభినందించారు. అనంతరం మాట్లాడుతూ భారత ప్రభుత్వం స్టార్టప్‌లకు ఆర్థికంగా ఎంతో ప్రోత్సాహం అందిస్తోందన్నారు. అవకాశాల్ని సద్వినియోగం చేసుకుని ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జెట్టి అప్పారావు, ప్రోగ్రామ్ కన్వీనర్ గోనుగుంట్ల రామస్వామి, కో–కన్వీనర్ దొమ్మేటి విజయసారథి, హరికృష్ణ, కందెపు సునీత, డీన్ పోపూరి రమేష్ బాబు, ప్రొఫెసర్ జంపని కిశోర్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచండి



భట్టిప్రోలు: ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను తద్వారా కలిగే ఉపయోగాలను ప్రతి కుటుంబానికి తెలియజేయాలని మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ కోరారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంఎస్ఈసీ సమావేశం సమాఖ్య అధ్యక్షురాలు జాలాది ధనలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ మాట్లాడుతూ అధికారుల ఆదేశానుసారం రైతు సాధికార సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థలు సమన్వయంతో పని చేసి ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో మార్కెటింగ్ ఎన్ఎఫ్ఏ బీవీ శ్రీనివాసరావు, సమాఖ్య కోశాధికారి కట్టా జ్యోతి, శ్రీ నిధి మేనేజర్ పిల్లి అశోక్, ఏపీసీఎన్ఎఫ్ మార్కెటింగ్ సీఆర్పీ బీ. శ్రీనివాసరావు, యానిమేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

పండుటాకు ప్రాణాలు కాపాడిన పోలీసులు



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం కోనేటిపురం బస్ షెల్టర్‌లో గుర్తు తెలియని వృద్ధురాలు అపస్మారక స్థితిలో ఉండటాన్ని చూసి స్థానిక పోలీసులు వైద్యశాలలో చేర్పి మానవత్వాన్ని చాటుకున్నారు. శనివారం స్థానిక బస్ షెల్టర్‌లో ఓ వృద్ధురాలు అనారోగ్యంతో బాధపడుతూ ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ వృద్ధురాలిని అంబులెన్స్‌లో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడ నుంచి ఆమెను తెనాలి ఏరియా వైద్యశాలకు రిఫర్ చేశారు.

పోలియో రహిత సమాజాన్ని నిర్మిద్దాం



పల్స్ పోలియోపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వేమూరు: పోలియో రహిత సమాజన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ పల్స్ పోలియో గురించి అవగాహన కల్పించాలని ఎంపీడీవో జియస్‌వి శేషగిరిరావు అన్నారు. వేమూరు మండల కేంద్రంలో పోలియో చుక్కలపై శనివారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 3,4,5, తేదీల్లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. మండలంలోని 14 గ్రామ సచివాలయాల్లో 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పెరవలి మండల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ వెంకట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్



విద్యార్థుల ప్రదర్శనల వివరాలు తెలుసుకుంటున్న ఉపాధ్యాయులు

గుంటూరు రూరల్: చదువు అంటే విద్యార్థులు బట్టి పట్టి చదవడం కాదని, సాంకేతిక నిర్మాణ పరిజ్ఞానం తెలుసుకున్నపుడే సార్థకత ఉంటుందని నెక్స్టజెన్ ఇంటర్‌నేషనల్ స్కూల్ డైరెక్టర్లు కె. శ్రీకాంత్‌బాబు, శ్రీవిద్య తెలిపారు. గోరంట్లలోని స్కూలులో శనివారం నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పో ఆకట్టుకుంది.విద్యార్థులుసైన్స్, విజ్ఞాన ప్రదర్శన స్టాల్స్ నిర్వహించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తిలకించి విద్యార్థుల్ని అభినందించారు. ప్రయోగాల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చీఫ్ ఆఫీసర్ కె. శ్రీకాంత్, ప్రిన్సిపల్ సుధీర్ కిషన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: అగ్ని ప్రమాద బాధితులను ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. బాపట్ల జిల్లా కర్లపాలెం మండలం పాతనందాయపాలెంలో శుక్రవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కోకి వీరారెడ్డి, పిట్టి గోపిరెడ్డిల పూరిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో గృహంలోని దుస్తులు, వంట పాత్రలు కాలిపోవటంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోన ర ఘుపతి బాధితుల వద్దకు వెళ్లి ఒక్కొక్క కుటుంబానికి రూ.10 వేలు చొప్పున నగదు అందజేశారు. బాధితులకు స్థానిక సర్పంచ్ కావూరి చిట్టెమ్మ, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి చేతుల మీదుగా ఒక్కొక్క కుటుంబానికి రూ.5వేల చొప్పున అందజేశారు. ఈ రెండు కుటుంబాలకు ప్రభుత్వం తరపున వీఆర్వో శివనాగరాజు 20 కేజీల బియ్యం, ఇతర సరకులు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యల్లావుల ఏడుకొండలు, ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, సర్పంచ్ కావూరి చిట్టెమ్మ, నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, అక్కల రమణారెడ్డి, ఆట్ల హరిబాబురెడ్డి, పేరాల వెంకటసురేష్ తదితరులు ఉన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం పంచాయతీ గౌడపాలెంలో శుక్రవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాటూరి వెంకటేశ్వర్లు పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. బాధిత కుటుంబానికి వీఆర్వో రమేష్‌రెడ్డి 20 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.

సోలార్ రూఫ్‌టాప్ పథకంతో లబ్ధి

రేపల్లె సబ్ డివిజన్ పోస్టల్ అధికారి కె.ఏడుకొండలు



రేపల్లె రూరల్: ప్రధాన మంత్రి సూర్యోదయ యోజనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్న సోలార్ రూఫ్ టాప్ పథకానికి ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని తపాలా శాఖ రేపల్లె సబ్ డివిజన్ పోస్టల్ అధికారి కె. ఏడుకొండలు సూచించారు. పట్టణంలోని పోస్టాఫీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. పథకంలో భాగంగా ఇండ్లపై కప్పులపై సోలార్ ప్యానల్స్‌ను అమర్చటం జరుగుతుందన్నారు. రేపల్లె డివిజన్ పరిధిలోని ప్రజలు ఈ పథకానికి తమ పరిధిలోని పోస్టాఫీసులలో ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. ఎంపికైన వారికి 300 యూనిట్ల వరకు సరఫరా చేసే ప్యానల్ ప్లేట్లు అమర్చుతారన్నారు. ఈ పథకంలో ప్యానల్ ప్లేట్లు అమర్చేందుకు మొత్తం రూ.1.80 లక్షల వ్యయం అవుతుందని, దీనిలో రూ.78 వేలు సబ్సిడీ ఉంటుందని చెప్పారు. ఆసక్తి గల వినియోగదారులు పోస్టల్ సిబ్బంది ద్వారా తమ వివరాలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారిలో పథకానికి ఎంపికైన అర్హులకు మాత్రమే సోలార్ ప్లాంట్లను అమర్చటం జరుగుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సమీప పోస్టాఫీసులలో సంప్రదించాలన్నారు.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆర్డీవో హెలా షారోన్



పాల్గొన్న అధికారులు, సిబ్బంది

ఆర్డీవో హెలా షారోన్

రేపల్లె రూరల్: ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో హెలా షారోన్ సూచించారు. స్థానిక రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో శనివారం సెక్టారు అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, వీడియో గ్రాఫర్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వీడియో గ్రాఫర్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది తమకు కేటాయించిన రూట్‌లలో అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల సరళిని వీడియో గ్రాఫర్‌లు ఎప్పటికప్పుడు కెమెరాలలో చిత్రీకరించాలన్నారు. ఎన్నికలలో పోటీచేసే పార్టీల అభ్యర్థులు చేసే వ్యయాన్ని ఎప్పటికప్పుడు నిష్పక్షపాతంగా లెక్కించాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రలోభాలకు తలొగ్గితే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. ఈ సందర్భంగా ట్రైనర్ గుర్రం మురళీమోహన్ ఎన్నికల విధులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధులపై శిక్షణ కల్పించారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అనురాధ, వివిధ మండలాల తహసీల్దార్‌లు, పోలీసులు, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

బాపట్ల జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.వాణిశ్రీ



ఎస్‌పీఎం దుకాణానికి ఆవును అందజేస్తున్న వాణిశ్రీ

భట్టిప్రోలు: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం శాస్త్ర బద్ధమైన వ్యవసాయ పద్ధతి అని బాపట్ల జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.వాణిశ్రీ పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 177 మంది ఎస్సీ రైతులకు 200, 100 లీటర్ల డ్రమ్ములు, రెండు పరదా పట్టాలు చొప్పున మంజూరయ్యాయి. కోనేటిపురంలో రైతులకు శనివారం వీటిని అందజేశారు. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ హరిత విప్లవం వల్ల భూమిలో విష పదార్థాలు పెరుగుతాయని నిరూపించి ఈ పద్ధతిని రైతులకు వివరిస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు చింతమోటులోని ఎస్‌పీఎం దుకాణానికి ఉచితంగా ఆవును ఇప్పించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ మార్కెటింగ్ సీఆర్పీ బి.శ్రీనివాసరావు, ఐబీ ఎంట్రీ బాలపాప, ఎల్–1 పీఆర్పీ శివనాగేశ్వరమ్మ, ఐసీఆర్పీలు చందోలు సుశీల, పానుగంటి సాంబశివరావు, ఎంసీఏ దోవా ఝాన్సీ, రైతులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఏపీటీఐ సౌత్ రీజియన్ అధ్యక్షుడు వెంకటరమణ, కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఏపీటీఐ సౌత్ రీజియన్ అధ్యక్షుడు డాక్టర్ ఎం. వెంకటరమణ తెలిపారు. నాలుగు రోజులుగా చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫార్మా ఉమెన్స్ లీగ్- 2024 పోటీలు శనివారంతో ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే కార్యక్రమాల్ని నిర్వహించేందుకు చిప్స్ కళాశాల ఎల్లపుడూ ముందుంటుందన్నారు. కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏపీటీఐ నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ మిలింద్ జె ఉమెకర్ మాట్లాడుతూ ఏపీటీఐ ఆధ్వర్యంలో ఇటువంటి క్రీడా కార్యక్రమాలు నిర్వహించటం సంతోషకరమని పేర్కొన్నారు. క్రీడల ద్వారా నూతనోత్తేజంతో మహిళలు ఉపశమనం పొంది, మళ్లీ అకడమిక్ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనే వీలుంటుందని తెలిపారు. స్త్రీలను అన్ని రంగాల్లో గౌరవించడం ముఖ్య ధర్మమని చెప్పారు. అనంతరం పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు.73వ ఇండియన్ పార్మాస్యూటికల్ కాంగ్రెస్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ విద్యాధర్, రాష్ట్ర ఏపీటీఐ ఆఫీస్ మెంబర్స్ వెంకటరమణ, అంకమ్మ చౌదరి, లక్ష్మణరావు, డి. నరేంద్ర, ఉమెన్ ఫోరం కన్వీనర్ కె. పద్మలత, కళాశాల చైర్మన్ ఆర్. శ్రీనివాస్ పాల్గొన్నారు.